







జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం 07-04-2025 | పేజీలు: 6






# జగదానంద కారకా..
# జయ జానకీ ప్రాణ నాయకా..

జగదానంద కారకుడు, జగదభిరాముడు, భక్తకోటి తీరొక్క పేరుతో పిలుచుకునే భద్రాద్రి రాములోరి కల్యాణ వేడుక ఆదివారం భద్రాచలం లో కనుల పండువగా సాగింది. అభిజిత్ లగ్నంలో రాముడు, జగన్మాత సీతమ్మ మెడలో మాంగళ్యధారణ చేశారు. ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. దేవదేవుడి కల్యాణవైభోగాన్ని కనులారా వీక్షించిన భక్తజనం పులకించారు.



- భద్రాచలంలో వైభవోపేతంగా సీతారాముల కల్యాణం
- సీతారాముల కళ్యాణ మహొత్సవం చూసి తరించిన భక్తజనం..
- ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దంపతులు.
- రామ నామ స్మరణలతో మారుమోగిన భద్రాద్రి..

2లో



## సామాన్యుడి ఇంటికి ముఖ్యమంత్రి

### సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేసిన రేవంత్ రెడ్డి



**బూర్గంపహాడ్/భద్రాచలం, ఏప్రిల్ 25 (ప్రజా జ్యోతి):** గచ్చు పైనే కూర్చొని బూరం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసారు . బూరం శ్రీనివాసరావు కుటుంభ సభ్యులు తయారుచేసిన వంటకాలను ముఖ్యమంత్రి స్వయంగా వడ్డించుకున్నారు . ఈ కార్యక్రమంలో ముఖ్య మంత్రి తో పాటు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కరెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌర సంబంధాల

6లో

## అంతా రామమయం..

### శ్రీసీతారాముల కల్యాణాన్ని వీక్షించిన భక్తజనం


కిక్కిరిసిన భద్రాచల పుణ్యక్షేత్రం హాజరైన పలువురు ప్రముఖులు





6లో

# జగదానంద కారకా.. జయ జానకీ ప్రాణ నాయకా..





**భద్రాచలం ,ఏప్రిల్ 6(ప్రజాజ్యోతి ):**

లోక కల్యాణంగా భావించే శ్రీ సీతారాముల కల్యాణం భద్రాచలంలో అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజామున 2 గంటలకు ఆలయాన్ని తెరిచి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం తిరువారాధన, ఉదయం 4 నుంచి 5 గంటల వరకు మూలవర్లకు అభిషేకం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ధ్రువమూర్తుల కళ్యాణం నిర్వహించారు. ఈ క్రతువు ముగిసిన తర్వాత కళ్యాణ మూర్తులకు అలంకరణ చేసి మిథిలా మండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. మిథిలా మైదానంలో కిక్కిరిసిన భక్తజన సందోహం మధ్య ఉదయం 10:30 గంటలకు వేదమంత్రోచ్ఛారణల నడుమ కల్యాణ ఘట్టం ప్రారంభమైంది. మొదట మేళతాళాలు, భక్తుల జయజయద్వానాల మధ్య కల్యాణమూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం స్వామివారికి ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.కల్యాణ క్రతువులో తిరుకల్యాణానికి సంకల్పం పలికి సర్వవిఙ్ఞాన శాంతికి విశ్వక్సేన ఆరాధన నిర్వహించారు. ఆ తర్వాత కల్యాణానికి ఉపయోగించే సామాగ్రికి సంప్రోక్షణ తర్వాత రక్షా బంధనం నిర్వహించి యోక్త్రధారణ చేశారు. 12 దర్భలతో ప్రత్యేకంగా అల్లిన తాడును సీతమ్మవారి నడుముకు అలంకరించారు. యోక్త్రధారణ చేయడం ద్వారా గర్భస్త దోషాలు తొలుగుతాయని చెబుతారు. సీతారాములకు రక్షాబంధనం కట్టి స్వామి గృహస్త ధర్మం కోసం యజ్ఞోప వితరణ చేసి, కన్యావరుణ నిర్వహించి తాంబూలాది సత్కారాలు అందించారు. శ్రీరాముడికి సీతమ్మ తగిన వధువని పెద్దలు నిర్ణయించి ఇరువంశాల గోత్రాలు పఠించారు. స్వామివారి పాదప్రక్షాళన చేసి మహాదానాలు సమర్పించారు. భక్త రామదాసు సమర్పించిన పచ్చల హారం సహా పలు అభరణాలను స్వామి, అమ్మవారికి అలంకరించారు.కల్యాణ వైభవాన్ని చాటిచెప్పేలా చూర్ణికను పఠించిన అనంతరం వేద మంత్రోచ్చరణాలు మారుమోగుతుండగా జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సుపై ఉంచారు. జగత్ కల్యాణ శుభ సన్నివేశాన్ని కనులారా వీక్షించి భక్తులు తన్మయత్వం పొందారు. లోకమంతా వేయికళ్లతో ఎదురుచూసిన సీతమ్మవారి మెడలో శ్రీరామచంద్రుడు మాంగళ్యధారణ చేశారు. జగదభిరాముడు మూడుముళ్లు వేసిన క్షణాన ముల్లోకాలు మురిశాయి. లక్షలాది సంఖ్యలో తరలివచ్చిన భక్తుల రామనామస్మరణ మధ్య ఆ జగదభిరాముడు జానకమ్మను మనువాడాడు.రాముడు దోసిట తలంబ్రాలు నీలపురాసులుగా జానకి దోసిట తలంబ్రాలు మనిమాణిక్యాలై సాక్ష్యాత్కరించిన వేళ మిథిలా మైదానం భక్తి పారవశ్యంలో ఓలలాడింది. శ్రీరామనవమి సందర్భంగా కల్యాణ కాంతులతో కళకళలాడిన పురుషోత్తముడికి సోమవారం పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం జరగనుంది.మిథిలా స్టేడియానికి చేరుకున్న గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దంపతులు, స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉప ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, దేవాదాయశాఖ. మంత్రి శ్రీమతి కొండా సురేఖ, రాష్ట్ర రెవెన్యూ గృహ, సమాచార శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ, జౌళి సహకార శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారి, మధ్య ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరహరి, నల్గొండ, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, భద్రాచలం, పినపాక, సత్తుపల్లి, వైరా, ఇల్లందు, కొత్తగూడెం శాసనసభ్యులు. దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ లు ముందు గా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలు మేళతాళాలతో స్వాగతం పలికారు.స్వామి వారి కళ్యాణ వేడుకలకు తెలంగాణహై కోర్ట్ జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద, ఎపి హై కోర్టు జడ్జి కృష్ణ మోహన్, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల జడ్జీలు రాజ గోపాల్, వసంత్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించడానికి వచ్చే భక్తులకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉదయం 5 గంటలకు సెక్టార్ కు చేరుకుని సెక్టార్ లో ఏర్పాట్లను పర్యవేక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వేడిమి దృష్ట్యా భక్తులు ఇబ్బందులు. పడకుండా మిథిలా స్టేడియం ఏర్పాటు చేశారు. ఎస్పీ రోహిత్ రాజు నేతృతంలో పోలీస్ యంత్రాంగం పటిష్ట బందో బస్తు ఏర్పాట్లు చేసింది.








## నేడు జగదభిరాముడి పట్టాభిషేకం

**చతుఃస్థానార్చన హెూమంతో మొదలు**

**నదీ, సముద్ర జలాలతో ప్రత్యేక పూజలు**

**ముఖ్య అతిథిగా రానున్న గవర్నర్**

**భద్రాచలం,ఏప్రిల్ 6(ప్రజాజ్యోతి):**

శ్రీరాముడి మహాపట్టాభిషేకం స్మరణకు వచ్చేలా అదే చైత్ర శుద్ధ పూర్ణిమ ముహుర్తానా పట్టాభిషేక మహోత్సవాన్ని భద్రాచల పుణ్యక్షేత్రంలో నిర్వహిస్తారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం యాగశాలలో చతుః స్థానార్చన హెూమం నిర్వహిస్తారు. 10 గంటలకు శంఖ, చక్ర, ధనుర్బాణాలు ధరించిన లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ విగ్రహాల మేళతాళాలు, కోలాటం, భక్తుల జయజయ ధ్వానాల నడుమమిథిలా స్టేడియంలోకి తీసుకొస్తారు. సింహాసనం లో వేంచేపు చేశాక ఎలాంటి విఘ్నాలు రాకుండా విశ్వక్సేన పూజ చేస్తారు. ఆ తర్వాత పుణ్యావాచనం చేసి మంత్రజలంతో ప్రాంగణాన్ని, పూజా సామగ్రిని సంప్రోక్షణ చేస్తారు.

### మూడు మండపాలు

పట్టాభిషేకం జరిగే ప్రధాన మండపానికి ముందు మూడు ఉప మండపాలు ఏర్పాటుచేస్తారు. ఒక మండపంలో హనుమంతుడు, సుగ్రీవుడు సహా ఎనిమిది మంది రామపరివారం, అష్టదిక్పాలకు లను ఆవాహన చేస్తారు. మధ్య మండపంలో మం త్రజలంతో 500 నదులు, నాలుగు సముద్ర జలాలను ఆవాహన చేస్తారు. మూడో మండపంలో శ్రీరాముడికి సంబంధించిన రాజముద్ర, రాజదండం, పాదుకలు ఉంచుతారు. అనంతరం అష్టోత్తర సహస్ర నామార్చన, సువర్ణ పుష్పార్చనలతో పూజలు నిర్వహించి పంచకుండాత్మక, పంచేష్టి సహిత చతుర్వేద హవనం, మండపత్రయఆరాధన నిర్వహిస్తారు. శ్రీరాముడి పట్టాభిషేకం నిర్వహించేందుకు వైదిక మంత్రాలతో వశిష్టుడు, వామనుడు, జాబాలి, కశ్య పుడు, కాత్యాయనుడు, గౌతముడు, విజయుడు, సుయజ్ఞుడు అనే 8 మంది మంత్రులను వేద పండి తులు వరింపజేసుకుంటారు. అనంతరం పట్టాభిషేక కార్యక్రమం నిర్వహిస్తారు. వీరికి నేతృత్వం వహించేందుకు వాల్మికి స్థానాన్ని మరొకరు వరింప జేసుకుని పట్టాభిషేక మహోత్సవాన్ని పూర్తిచేస్తారు. పట్టాభిషేక వేడుకలకు గవర్నర్లు వచ్చి పట్టు వస్త్రా లు సమర్పించే సంప్రదాయం కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా గవర్నర్ రాధాకృష్ణన్ భద్రాచలం రానున్నారు. పట్టాభిషేకం కార్యక్రమాన్ని ప్రత్యక్షం గా వీక్షిస్తే విజయసిద్ధి కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో సీతారాముల కల్యాణానికి వచ్చిన భక్తులు చాలా మంది పట్టాభిషేకం కోసం భద్రాద్రిలోనే ఉండిపోయారు. భద్రాచలంలో సోమవారం జరగనున్న శ్రీరామ పట్టాభిషేకానికి మ మ్మర ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. సారపాకలోని ఐటీసీ గెస్ట్ హౌస్ లో ఆదివారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు.





## బుడిదగడ్డ 1 వ వార్డు వైభోపేతంగా శ్రీ రామ చంద్రుడు సీతమ్మ వారి కళ్యాణమ్.

**కొత్తగూడెం మున్సిపాలిటీ ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి.**

జిల్లా కేంద్రం ఐన కొత్తగూడెం మున్సిపాలిటీ లోని పలు వార్డుల్లో శ్రీ సీత రామచంద్ర స్వామి వారు కల్యాణం అంగ రంగ వైభవంగా నిర్వహించారు , పలువురు నాయకులు, వార్డుల్లోని ప్రజలు పరమ భక్తి తో శ్రీరాములు వారి కల్యాణం వేడుకలను వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అనంతరం అన్న ప్రసాదం ను భక్తులకు వడ్డించినరు. శ్రీ రామ నవమి సందర్భాగ మెయిన్ రోడ్డు లో ని లక్ష్మిదేవి పల్లి మొదలు చుంచుపల్లి విద్యానగర్ వరకు అన్నీ కూడలి లో సేవాసంస్థలు, వ్యాపారస్తులు భక్తులకు, యాత్రికులకు పానకలు మజ్జిగ, పులిహోర మంచినీరు అందించినారు

## అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం

**మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు**

**తిలకించేందుకు తరలివచ్చిన ప్రజలు**



**టేకులపల్లి, ఏప్రిల్ 06, ప్రజాజ్యోతి :**



శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని 36 గ్రామం పంచాయతీలోని ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు.అన్ని ఆలయాలు వేదమంత్రాల ఉచ్చరణల నడుమ భక్తి శ్రద్ధలతో కళ్యాణ తంతు వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో పూజారి శ్రీరంగం అజయ్ చక్రి, విజయ్ సాయి చక్రి వారి ఆధ్వర్యంలో పెళ్లి తంతు జరిగింది. టేకులపల్లి , గోలియా తండా , దాస్తాండా పంచాయతీల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పల్లవి ట్రేడర్స్ అన్న వితరణ చేశారు. సంపత్ నగర్, మొక్కంపాడు తండా , తూర్పు గూడెం, కొక్యా తండా తదితర గ్రామాలలో కల్యాణ వేడుకలు జరిగాయి. 36 గ్రామపంచాయతీలలో జరిగిన వేడుకలలో మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు , ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి సిపిఎం నాయకుల అరెస్టులను ఖండించండి

**సిపిఎం అంటే పాలకులకు భయమెందుకు.**

**భద్రాచలం పట్టణసమస్యలు పరిష్కరించమనటం నేరమా**

**అరెస్టులతో ప్రజా ఉద్యమాలు అనచలేరు**

**పట్టణ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు మా పోరాటం ఆగదు**

**సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ**



**భద్రాచలం టౌన్,ఏప్రిల్ 6(ప్రజాజ్యోతి):**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై ధమనకాండ సాగిస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి శ్రీరామనవమికి భద్రాచలం పర్యటనను దృష్టిలో ఉంచుకొని పోలీసులు భద్రాచలం పట్టణంలో సిపిఎం నాయకులను ముందస్తు అరెస్టులు చేయటం అప్రజాస్వామిక చర్యగా సిపిఎం పట్టణ కమిటీ ఆరోపించింది. అర్ధరాత్రి సిపిఎం నాయకులను అరెస్టు చేయడాన్ని పార్టీ పట్టణ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఇలా ప్రశ్నించే గొంతులను ఎంతకాలం అనిచివేస్తారని, ప్రజా ఉద్యమాలను అణిచివేయటం కాంగ్రెస్ ప్రభుత్వం తరం కాదని, అర్ధరాత్రి పోలీసులు సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు, డి సీతాలక్ష్మి, సీనియర్ నాయకురాలు నాదెళ్ల లీలావతి,బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లను అరెస్టు చేసి ఎక్కడో కిన్నెరసాని పోలీస్ స్టేషన్ కు తరలించడం హేయమైన అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బండారు శరత్ బాబు లు ఒక ప్రకటనలో ఖండించారు. భద్రాచలం పట్టణ సమస్యలు పరిష్కారం చమని కోరడం నేరమా అని అన్నారు. సిపిఎం అంటే పాలకులకు భయం ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్ర విభజనలో నష్టపోయిన భద్రాచలం ప్రాంతాన్ని అన్ని విధాల ఆదుకోవాలని సిపిఎం పార్టీ గత అనేక సంవత్సరాలుగా పోరాడుతూనే ఉన్నదని, గత పాలకులు భద్రాచలం పట్ల తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేశారని నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడవడం సరైనది కాదని అన్నారు. భద్రాచలం పట్టణానికి ఆనుకొని ఉన్న ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో కలపాలని మేనిఫెస్టో లో పెట్టిన కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నమేంటో చెప్పాలని ప్రశ్నించారు. పోలవరం బ్యాక్ వాటర్ తో తెలంగాణ రాష్ట్రంలో భద్రాచలంతో పాటు పలు గ్రామాలు ముంపుకు గురవుతున్న నేపథ్యంలో కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని కోరారు. గోదావరికి ఇరువైపులా కరకట్ట నిర్మాణానికి కావలసిన నిధులు మంజూరు చేసి పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లేందుకు అనుమతి కోరితే అరెస్టులు చేస్తారా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# భద్రాద్రి అభివృద్ధి కి నిధులు అడిగితే అరెస్టులు చేయడం సిగ్గుచేటు.

**సిపిఎం నాయకులు తో పాటు సీపీఐ ఎంఎల్,బిఆర్ఎస్ పార్టీ నాయకులను వెంటనే విడుదల చేయాలి.**

**అరెస్టులపై ఉన్న చిత్తశుద్ధి, అభివృద్ధిపై చూపించండి.**



**పాల్వంచ(రూరల్ ), ఏప్రిల్ 06,ప్రజా జ్యోతి :**

భద్రాచలం అభివృద్ధికి నిధులు కేటాయించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలని కోరుతూ సిపిఎం పార్టీ భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు శాంతి యుతంగా నిర్వహిస్తుంటే.నిన్న అర్ధరాత్రి అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటు అని,అరెస్ట్ చేసినవారిని వెంటనే విడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నారు.భద్రాచలంలో అరెస్ట్ చేసి పాల్వంచ మండల పోలీస్ స్టేషన్ కు తరలించిన సీపీఎం నాయకులు గడ్డం స్వామి, వైవీ రామారావు, బత్తుల వెంకటేశ్వర్లు తో పాటు సీపీఐ ఎంఎల్,బిఆర్ఎస్ పార్టీ నాయకులను కలిసి పరామర్శించారు,అనంతరం కనకయ్య మాట్లాడుతూ నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భద్రాద్రి అభివృద్ధి కోసం నిధులు కేటాయించకుండా ప్రతి సంవత్సరం భద్రాద్రి రాముడి పుణ్యక్షేత్రమైన భద్రాచలం కు వచ్చి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు ఇచ్చి .. నిధులను మరిచి భద్రాచలంపై చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు పట్ల ఆయన మండిపడ్డారు . సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా అధికార పార్టీ నాయకులకు జిల్లా అధికారులకు భద్రాచల గుడికి సంబంధించిన ఉన్నతాధికారులను కలిసి అనేకసార్లు విన్నవించినప్పటికీ నేటికీ ఎటువంటి సమాధానం లేదని ఆయన విమర్శించారు. వర్షాకాలం వచ్చినప్పుడల్లా గోదావరి కరకట్ట విషయంలో ఎటువంటి పురోగమన పద్ధతి లేకుండా ప్రజల జీవితాలతో చెలగాటమాడుతూ అనేక సమస్యలను సృష్టిస్తున్న కరకట్ట విషయంలో ఎత్తు పెంచాలని చెబుతున్నప్పటికీ ఎటువంటి నిధులు కేటాయించకుండా ఉండటంవల్ల అనేక ఇబ్బందులు పడుతున్న సంగతి కాంగ్రెస్ ప్రభుత్వానికి కనబడట్లేదా అని ఆయన ప్రశ్నించారు.గతంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు కాలయాపన చేసిందని అధికారంలో కి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాద్రి నీ అభివృద్ధి చేస్తామని చెప్పి సంవత్సర కాలం గడించినప్పటికీ నేటికి ఒక్కపైసా కూడా కేటాయించ కుండా ప్రజలను మోసం చేస్తున్న తీరు పై ఆయన మండిపడ్డారు.న్యాయమైన పోరాటం చేస్తున్న సిపిఎం నాయకులు పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరి సరైనది కాదని ఆయన అన్నారు.ప్రజల కోసం భద్రాద్రి అభివృద్ధి కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ఈరోజు అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. దమ్ముంటే భద్రాద్రి కి నిధులు కేటాయించేల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేయాలని ఆయన అన్నారు,న్యాయమైనటువంటి పద్ధతి ప్రకారం పోరాటం చేస్తున్న సిపిఎం నాయకులను ఇతర పార్టీ నాయకులను దొంగల్లాగా అర్ధరాత్రి ఇంటికి వెళ్లి ఇంట్లో ఉన్న వారిని బలవంతంగా బయటికి పిలిపించి కార్లలో నొక్కి ఇతర మండలాల పోలీస్ స్టేషన్లకు తీసుకువచ్చి ఇలా నిరంకుశ వైఖరిని ప్రదర్శించడం సరైనది కాదన్నారు.

# రామయ్యను దర్శించుకున్న సీఎం దంపతులు



భద్రాచలం, ఏప్రిల్ 6(ప్రజాజ్యోతి ):

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అర్చకులు, అధికారులు, మంత్రులు ఆయనకు ఎదురెళ్లి ఆలయ సాంప్రదాయంతో పరివట్టం కట్టి స్వాగతం పలికారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద సీఎం దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడిలో స్వామివారికి పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం ఉప ఆలయమైన లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు ఆలయ ఈవో, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి 45 వసంతాల ఆవిర్భావ వేడుకలు

**పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన మండల అధ్యక్షుడు నూపా రమేష్**

చర్ల,ఏప్రిల్ 6 ( ప్రజా జ్యోతి )

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో ఆదివారం నాడు బీజేపీ పార్టీ కార్యాలయం లో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ జండా ఆవిష్కరించిన చర్ల మండల అధ్యక్షులు నూపా రమేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ (భాజపా), భారతదేశంలో జాతీయస్థాయి పార్టీగా 1980లో ప్రారంభించి నేటికీ 45 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా వేడుకలను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధానపాత్ర పోషిస్తున్న సంఘ్ పరివార్ కుటుంబానికి చెందిన వివిధ రకాల హిందూ జాతీయవాద సంస్థలు భారతీయ జనతా పార్టీకి కార్యకర్తల స్థాయిలో గట్టి పునాదిని ఇస్తూ భారతదేశంలో నూరు వసంతాల కాంగ్రెస్ పార్టీ కి గట్టి సవాలును విసురుతుంది అన్నారు. భాజపా, అనేక ఇతర పార్టీల మద్దతుతో 1999 నుండి 2004 వరకు భారత కేంద్ర ప్రభుత్వాన్ని పాలించిందని, దాని సీనియర్ నాయకులైన అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగాను, లాల్ కృష్ణ అద్వానీ ఉప ప్రధానమంత్రిగానూ పనిచేసి జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో ప్రధాన ప్రతిపక్షముగా 2014 మే వరకు కొనసాగినట్లు ఆయన వివరించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి భాజపా తొలి అధ్యక్షుడిగా నియమించబడ్డ నాటినుండి భారతదేశాన్ని శక్తివంతమైన, సౌభాగ్యకరమైన దేశంగా తీర్చిదిద్దే క్రమంలో బలమైన శక్తిగా ఎదుగుతూ నేడు భారతదేశంలోనే తిరుగులేని పార్టీగా భారతీయ జనతాపార్టీ మారిందని అంతేకాకుండా దేశాన్ని శక్తివంతమైన ప్రజాస్వామిక రాజ్యంగా తీర్చిదిద్ది పౌరులందరికీ కుల, మత, లింగ భేదాలు లేకుండా రాజకీయ, ఆర్థిక, సాంఘిక న్యాయాన్ని, స్వేచ్ఛను కల్పించడం పార్టీ ఆశయాలుగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు ,ఈ కార్యక్రమం లో జిల్లా కౌన్సిల్ మెంబెర్ బాబా పాహిం, జిల్లా కార్యవర్గ సభ్యులు గునురి రమణ, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, బంధా మధు,విశ్వనాధం,కిసాన్ మోర్చా అధ్యక్షులు ఇర్ప సుబ్బారావు, మరియు మల్లెల ప్రశాంత్ బొల్లె వినోద్ కుప్ప మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ ఎర్ర శ్రీకాంత్ మృతి పార్టీకి తీరని లోటు

టేకులపల్లి,ఏప్రిల్ 06,ప్రజాజ్యోతి:



సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, యావత్ దేశ రాజకీయాలకు తీరని లోటని టేకులపల్లి సిపిఎం మండల కమిటీ అన్నారు.ఈ సందర్భంగా రేపాకల శ్రీనివాస్ మాట్లాడుతూ మదురైలో జరుగుతున్న సిపిఎం జాతీయ మహాసభలకు ప్రతినిధిగా వెళ్లిన కామ్రేడ్ ఎర్రా శ్రీకాంత్ ఆదివారం ఉదయం గుండెపోటుతో మధురై పట్టణంలో తను చికిత్స పొందుతున్న ఆసుపత్రిలో మధ్యాహ్నం మరణించారని ఆస్పత్రి వర్గాలు తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవున్ని సిపిఎం టేకులపల్లి మండల కమిటీ తరపున భగవంతుని కోరారు.సిపిఎం మండల కార్యదర్శి ఈసం నరసింహారావు,మండల కమిటీ సభ్యులు కదుదుల వీరన్న, కుంజ రమేష్, పూనెం స్వామి,చంద్రశేఖర్ సంతాపం తెలిపారు.

## విద్యాసంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు వితరణ

భద్రాచలం టౌన్, ఏప్రిల్ 6(ప్రజాజ్యోతి):

భద్రాచలంలో శ్రీరామనవమి వేడుకలు సందర్భంగా త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థలు భక్తులు దాహార్తిని తీర్చడం కోసం భద్రాచలం టీజీ ఆర్టీసీ డిపో ఆర్ఎంఓ సరీరాము,కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ ఖాన్ చేతుల మీదుగా మజ్జిగ, మంచినీటి ప్యాకెట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ రామభక్తులకు సేవ చేయడం సాక్షాత్తు శ్రీరాముడికి సేవ చేయడం గానే మేమందరం భావిస్తున్నామని అన్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా భక్తుల కోసం మజ్జిగ,మంచినీటి ప్యాకెట్లు వితరణ జరిగిందని, ఈ సంవత్సరం కూడా దాదాపు 50 వేల మజ్జిగ ప్యాకెట్లు, 50 వేల మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది అన్నారు.



## మజ్జిగ పంపిణీ.

టేకులపల్లి, ఏప్రిల్ 06, ప్రజాజ్యోతి :

శ్రీరామనవమి పర్వదిన పురస్కరించుకొని కళ్యాణం తిలకించేందుకు వచ్చినటువంటి భక్తులకు ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని శ్రీ నందిని ట్రేడర్స్ ప్రొప్రైటర్ నాగినేని నరసింహారావు, కొడుకు నాగినేని రాఘవ ఆధ్వర్యంలో ఆదివారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

## రామయ్య కల్యాణానికి హాజరైన ఎంపీ కుటుంబం



భద్రాచలం, ఏప్రిల్ 6(ప్రజాజ్యోతి ):

భద్రాచలంలో ఆదివారం జరిగిన శ్రీసీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు ఖమ్మం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కుటుంబసమేతంగా మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. ఉదయం నుంచి స్టేడియం వద్దే ఉండి కల్యాణతంతును కన్నులారా వీక్షించారు. అనంతరం ఆలయంలో స్వామివారికి పూజలు చేసి తిరిగి పయనమయ్యారు. ఈ సందర్భంగా వద్దిరాజును స్థానిక నాయకులు కలిసి ముచ్చటించారు.

## ఎమ్మెల్సీకి బీఆర్ఎస్ నేతల సత్కారం

భద్రాచలం, ఏప్రిల్ 6(ప్రజాజ్యోతి):

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ భద్రాచలంలో శ్రీసీతారాముల కళ్యాణానికి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని బీఆర్ఎస్ నాయకుడు కోటగిరి ప్రబోద్ కుమార్ నివాసానికి వెళ్లారు. ఆ సమయంలో నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ కూడా అక్కడకు వెళ్లగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లిని ప్రబోద్ కుమార్ తో పాటు మానే రామకృష్ణలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్ , స్థానిక నాయకులు ఉన్నారు.



# ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

**మున్సిపల్ కమిషనరును ఆదేశించిన ఎమ్మెల్యే కూనంనేని**

కొత్తగూడెం, ఏప్రిల్ 6 ప్రజా జ్యోతి



కొత్తగూడెం మున్సిపాలిటీ, పాల్వంచ మున్సిపాలిటీల పరిధిలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికులు, పాదచారుల దాహార్తిని తీర్చాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు కమిషనర్ ను ఆదేశించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ ఇంచార్జి కమిషనర్, పాల్వంచ కమిషనరైన సుజాతకు మంగళవారం ఫోన్ చేసి పలు సూచనలు చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కొత్తగూడెం, పాల్వంచ మీదుగా వేలాది మంది భక్తులు భద్రాచలం సీతారాముల కల్యాణ మహోత్సవానికి వచ్చి పోతుంటారని, వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పరిసర గ్రామాల నుంచి వివిధ పనులపై కొత్తగూడెం జిల్లా కేంద్రానికి, పాల్వంచ పట్టణానికి వచ్చే ప్రజలు తాగునీరు కోసం ఇబ్బందిపడకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని సూచించారు.

# శ్రీరామనవమి ఉత్సవాల్లో ఐక్యతను చాటుదాం

**ఊరూ..వాడా ఒక్కతాటిపైకి రావడం అభినందనీయం**

**రెట్టింపు ఉత్సాహంతో పండుగలు జరుపుకుందాం**

**సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

కొత్తగూడెం , ఏప్రిల్ 6 ప్రజా జ్యోతి

శ్రీరామనవమి ఉత్సవాల్లో కులమతాలకు అతీతంగా పాల్గొని ఐక్యతను చాటుదామని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. ఆదివారం శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్తగూడెం పట్టణంలోని బస్టాండు సెంటర్లో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని, రైల్వే స్టేషన్ సెంటర్లో ఎస్ కె టి సంస్థ ఏర్పాటు చేసిన ప్రసాద, మజ్జిగ పంపిణి కార్యక్రమాన్ని సాబీర్ పాషా ప్రారంభించారు, అనంతరం పట్టణంలోని వివిధ సెంటర్లలో జరిగిన కళ్యాణోత్సవాల్లో పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పండుగలవేళ ఊరూ..వాడా ఏకమై ఉత్సహంగా సంబురాలు జరుపుకోవడం, పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కొత్తగూడెం ప్రాంతంలో అనాదిగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని నేటితరం కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని, ముఖ్యానంగా యువకులు బాధ్యత వహించడం శుభపరిణామమన్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలను కొనసాగిస్తూ భావితరాలకు ఈ సంప్రదాయాన్ని అందించడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులోనూ పండుగలను రెట్టింపు ఉత్సాహంతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పల్లపోతు సాయి బాబు, నెరేళ్ల రమేష్, సత్యనారాయణ చారి, బండి నర్సింహా, దుర్గ, ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



# నల్లమల గిరిప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పిస్తున్న ముత్యాల విశ్వనాథం, పలువురు నాయకులు

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 6, ప్రజా జ్యోతి:




కార్మిక, కర్షక, పేద ప్రజల హక్కులకోసం నిరంతరం పోరాడిన నల్లమల గిరిప్రసాద్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా మిగిలిపోయాడని, భూపోరాటాలకు నాయకత్వం వహించి లక్షలాది ఎకరాలను పేదలకు పంచిన ఘనత గిరిప్రసాద్ కు దక్కుతుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సిపిఐ మాజీ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు నల్లమల గిరిప్రసాద్ 94వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ లో ఘనంగా నిర్వహించారు. తొలుత గిరిప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పటి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ధృవతారగా వెలుగొందిన గిరిప్రసాద్ జీవితం, ఆయన చేసిన త్యాగం నేటి తరం కార్యకర్తలకు, నాయకులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలను నడిపించడంలో కీలకపాత్ర పోషించిన గిరిప్రసాద్ లేని లోటును పరిపూర్ణ చేయాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు. భూస్వామ్య వ్యవస్థ కు వ్య అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన గిరిప్రసాద్ జిల్లా అభివృద్ధికి, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారన్నారు, ఆయన చూపిన పోరాట మార్గంలో పయనిస్తూ నమ్మిన సిద్ధాంతాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించిన వాళ్లమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, డి సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, నరహరి నాగేశ్వరరావు, వర్క్ అజిత్, బీవీ సత్యనారయణ, వైఎస్ గిరి, ఆదినారాయణ, బాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిద్దాం

**ప్రజలను ఐక్యం చేస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలు**

**మతవిద్వేషాలు రెచ్చగొట్టే శక్తులపట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి**

**కొత్తగూడెం శాసనసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**

**నవమి ఉత్సవాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే**

కొత్తగూడెం, ఏప్రిల్ 6 ప్రజా జ్యోతి



అన్ని పండుగలు కలిసికట్టుగా జరుపుకొని మతసామరస్యాన్ని చాటడంతోపాటు భారతీయ సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సూచించారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఆదివారం చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్లో జరిగిన సీతారాముల కళ్యాణ వేడుకల్లో పాల్గొని భక్తులు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన పానకం పంపిణీ, మహా అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సోదరభావంతో మెలగాలని, ఈర్ష్యాద్వేశాలకు దూరంగా ఉండాలని కోరారు. నవమి ఉత్సవాలు ధనిక, పేద, కుల వర్గ తారతమ్యంలేకుండా ప్రజలనందరని ఏకం చేశాయని ఈ సంప్రదాయాన్ని కొనసాగించి శాంతియుత సమాజాన్ని నిర్మించాలని ఆకాంక్షించారు. కులాలు మతాల పేరుతో, ప్రాంతాల పేరుతో బిజెపి, ఆర్ఆర్ఎస్, బజరంగ్ దళ్ లాంటి శక్తులు ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు కుట్రలు చేస్తున్నాయని, ఈ శక్తులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, నాయకులు వాసిరెడ్డి మురళి, చందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్

భద్రాచలం ,ఏప్రిల్ 6(ప్రజాజ్యోతి )

: భద్రాద్రిలో సీతారామచంద్రస్వామివారి కల్యాణానికి వచ్చిన భక్తులకు ఆదివారం పలు కుల, స్వచ్ఛంద సంస్థలతో పాటు విద్యాసంస్థల వారు తమదైన శైలిలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాపు, క్షత్రీయ, కమ్మ, రెడ్డి కుల సంఘాలు, వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్న దాన కార్యక్రమం నిర్వహించగా.. రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, వాసవీ క్లబ్ వారు మజ్జిగా, పానకం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రధాన కూడళ్లలో వ్యాపారులు, వివిధ కార్మిక సంఘాలు,అంబెద్కర్ సెంటర్ నందు విజయ దుర్గ టీ స్టాల్,లక్ష్మి కంప్యూటర్స్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగా, తాగునీరు, బెల్లం పానకం అందజేశారు



# అన్నమో రామచంద్ర అంటేనే భక్తులకు భోజనం

కొత్తగూడెం ఏప్రిల్ 6 ప్రజా జ్యోతి..

లోక కళ్యాణార్థం ఎంతో విశిష్టతను కూడుకున్న శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం పురస్కరించుకొని ఊరువాడ భక్తులకు ఉచిత ప్రసాదాల తో పాటు ప్రతి ఒక్కరికి అన్నదాన కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో శ్రీరాముని పురస్కరించుకుని చేపట్టిన అన్నదానం షరతులతో కూడిన భక్తుల భోజనం నిర్వాహకులు ప్రవర్తించిన తీరు వింత ధోరణి కనపడింది. ప్రపంచ శాంతి కోసం నిర్వహిస్తున్న అనేక పండుగలు మతసామరస్యాలు అతీతంగా జరుపుకోవాలని పదేపదే పెద్దలు చెబుతున్నప్పటికీ పెద్దల మాటలను పెడచెవిన పెట్టిన ప్రబుద్ధులు జైశ్రీరామ్ అని నోటి నుండి పలికిన భక్తులకి మాత్రమే ఉచిత అన్నదానాలు పంపిణీ చేయడం మతసామరస్యాన్ని రెచ్చగొట్టే విధంగా ఉందని భక్తులు పెదవి విరిచారు. రైల్వే స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కొందరు ప్రబుద్ధులు భక్తులు కచ్చితంగా జైశ్రీరామ్ అనాల్సిందే. జైశ్రీరామ్ అని పలికిన భక్తులకు మాత్రమే భోజనాన్ని వడ్డించడం విశేషం. కొందరు ప్రబుద్ధులు ప్రవర్తించిన తీరు మతాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని నవమికి హాజరైన భక్తులు పెద్ద సంఖ్యలో ఆరోపించారు.



# అంతా రామమయం..

భద్రాచలం ,ఏప్రిల్ 6(ప్రజాజ్యోతి):

భద్రాచలంలో ఆదివారం జరిగిన శ్రీసీతారామచంద్రస్వామి కల్యా ణాన్ని కనులారా వీక్షించేందుకు వేలాదిగా భక్తులు హాజరయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు శుక్రవారం సాయంత్రమే చేరుకున్నారు. శనివారం తెల్లవారుజామునే పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి మిథిలా స్టేడియంలో జరిగిన కల్యాణోత్సవాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. కాగా కల్యాణానికి హాజరైన ప్రముఖులలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఉప ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, దేవాదాయశాఖ. మంత్రి శ్రీమతి కొండా సురేఖ, రాష్ట్ర రెవెన్యూ గృహ, సమాచార శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ, జౌళి సహకార శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారి, మధ్య ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరహరి, నల్గొండ, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, భద్రాచలం, పినపాక, సత్తుపల్లి, వైరా, ఇల్లందు, కొత్తగూడెం శాసనసభ్యులు.తెల్లం వెంకటరావు ,పాయం వెంకటేశ్వర్లు ,కోరం కనకయ్య ,మాలోత్ రాందాస్ ,కూనంనేని సాంబశివరావు , దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ ,తెలంగాణహై కోర్ట్ జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద, ఎపి హై కోర్టు జడ్జి కృష్ణ మోహన్, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల జడ్జీలు రాజ గోపాల్, వసంత్ పాటిల్ తదితరులు ఉన్నారు. ఎస్పీ రోహిత్ రాజ్ , భద్రాచలం దేవస్థానం ఈఓ రమాదేవి, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# రమణీయం.. కమనీయం -దర్గాలో రాములోరి కళ్యాణం





ఇల్లెందు, ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి:

ఇల్లందు సత్యనారాయణపురం అటవీ ప్రాంతంలోని హజరత్ నాగుల్ మీరా మౌలా చాంద్ దర్గాలు రాములోరి కళ్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. మతసామరస్యానికి ప్రత్యేకగా హజరత్ నాగుల్ మీరా దర్గా నిలుస్తుందనడానికి నిదర్శనమే శ్రీరామనవమి వేడుకల నిర్వహణ. దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రతి సంవత్సరం సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. ఆదివారం దర్గా ఆవరణలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని హిందూ సంప్రదాయబద్ధంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం దమ్మక్క వంశీయుల తో గోటితో ఒలిచిన తలంబ్రాలను దర్గాలో సమర్పించారు. ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా దర్గాకు కుల మతాలకు అతీతంగా మతసామరస్యానికి ప్రతీకగా సీతారామచంద్రస్వామి కళ్యాణాన్ని వీక్షించేందుకు భక్తజనం విశేషంగా హాజరయ్యారు. అభిజిత్ లగ్న ముహూర్తమున పురోహితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ సీతారామచంద్ర స్వాముల కళ్యాణాన్ని కమనీయంగా జరిపించారు. ఈ కళ్యాణ క్రతువును దర్గా మాలికులు దగ్గరుండి నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ దంపతులు సీతారామచంద్ర స్వాములకు తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణాన్ని తిలకించిన భక్తి జనం ఎంతో పరవశించిపోయారు. అనంతరం భక్తులకు దర్గా కమిటీ సభ్యులు అన్నప్రసాదాలను అందించారు.



# సామాన్యుడి ఇంటికి ముఖ్యమంత్రి

శాఖ మాత్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ, చేనేత, జౌలి శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం నియోజకవర్గం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు తో కలిసి ప్రభుత్వం అందించిన సన్న బియ్యంతో భోజనం ఆరగించారు.అనంతరం బూరం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి ఫోటో దిగారు . పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కలెక్టర్ ఘనంగా వీడ్కోలు పలకడంతో బిపిఎల్ హెలిప్యాడ్ గ్రౌండ్ నుండి హెలి క్యాప్టర్ ద్వారా హైదరాబాదుకు బయలుదేరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఇతర శాఖల అధికారులు పోలీస్ సిబ్బంది ఇంటిలిజెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ,పెరుగన్నం ,మంచి నీటి ప్యాకెట్ల పంపిణీ

**అదనపు సెషన్స్ కోర్టు మంజూరు చేయండి..**

హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద కు బార్ అసోసియేషన్ వినతి

భద్రాచలం ,ఏప్రిల్ 6(ప్రజాజ్యోతి ):శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా శ్రీ సీతా రామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్నీ తిలకించేందుకు వచ్చిన భక్తులకు జ్యుడిసియల్ మేజిస్ట్రేట్ కోర్ట్ ఆవరణలో ఆదివారం భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5 వేల మజ్జిగ,6 వేల మంచి నీటి ప్యాకెట్లు,కర్డ్ రైస్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం మాట్లాడుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెరుగన్నం, మజ్జిగ,మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు.( శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణానికి హాజరైన జిల్లా పోర్ట్ ఫోలియో,హైకోర్టు జడ్జి సూరేపల్లె నందా కల్యాణం అనంతరం జ్యుడిసియల్ మేజిస్ట్రేట్ కోర్ట్ ను సందర్శించారు.బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం,వైస్ ప్రెసిడెంట్ సున్నం రమేష్,ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాస చారి స్వాగతం పలికారు.న్యాయవాదులు కు జడ్జి సూరేపల్లి నంద స్వయంగా అన్నం వడ్డించారు.బార్ అధ్యక్షులు దేవదానం భద్రాచలం అదనపు సెషన్ కోర్టు మంజూరు చేయాలని హైకోర్టు జడ్జి నంద దృష్టికి తీసుకెళ్లగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లి కోర్టు మంజూరుకు కృషి చేస్తా అన్నారు.జిల్లా జడ్జి వసంత పాటిల్ ,ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ రామారావు,భద్రాచలం మేజిస్ట్రేట్ శివ నాయక్ ,బార్ కోశాధికారి పేరాల నాగరాజు,సంయుక్త కార్యదర్శి శరద్,న్యాయవాదులు సాధనపల్లి సతీష్ ,అంబేద్కర్, తిరుమలరావు, రామకృష్ణ ,సురేష్ ,మల్లికార్జున రావు,శ్రీనివాస్ ,మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.





## రామయ్య కళ్యాణానికి హాజరైన సింగరేణి సిఎండి

భద్రాచలం, ఏప్రిల్ 6 (ప్రజాజ్యోతి ):

భద్రాచలంలో ఆదివారం జరిగిన శ్రీ సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం నాయక్ ఐఆర్ఎస్ కుటుంబసమేతంగా మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. ఉదయం నుంచి స్టేడియం వద్దే ఉండి కల్యాణతంతును కన్నులారా వీక్షించారు. సీతారాముల కళ్యాణం సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో స్వామివారికి పూజలు చేసి తిరిగి పయనమయ్యారు. ఈ సందర్భంగా సిఎండితో స్థానిక నాయకులు కలిసి ముచ్చటించారు.

## దండు సారయ్య ఆధ్వర్యంలో రాములోరి కళ్యాణం

ఇల్లందు, ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి:



ఇల్లెందు పట్టణంలోని 13వ వార్డు ఆర్ అండ్ ఆర్ కాలనికి చెందిన శివశక్తి దండు సారయ్య (సారిక) ఆధ్వర్యంలో ఆదివారం రాములోరి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దండుసారయ్య మాట్లాడుతూ తమ ఆచారం ప్రకారం బియ్యం పోసుకుని పసుపు కొమ్ము కట్టుకొని సాంప్రదాయబద్ధంగా సీతారాముల కల్యాణాన్ని జరుపుతామన్నారు. రాములోరి ఆశీస్సులు ఎప్పుడూ తమకు ఉంటున్నాయని అందుకే రాములోరి కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో ఉపవాసాలతో నిర్వహిస్తామన్నారు.

## ఘనంగా భాతీయ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఆళ్ళపల్లి.ఏప్రిల్06.
ప్రజాజ్యోతి



భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఈరోజు ఆళ్ళపల్లి మండలం మర్కోడు గ్రామపంచాయతీలో బిజెపి మండల అధ్యక్షులు శ్రీనివాస్ చారి గారు జెండా ఆవిష్కరించడం జరిగినది.వారు మాట్లాడుతూ కేద్రం బీజేపీ చేస్తున్న పనులన్నీ ప్రజలు గమనిస్తూ ఉన్నారు ఇది గమనించి ప్రజలకు రావాల్సినయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలని. అదేవిదంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు పూణే వెంకటేష్ .ప్రధాన కార్యదర్శి కొమరం లక్ష్మయ్య.కార్యదర్శి పుణ్యం రాంబాబు. బొమ్మల రాంబాబు. పాయం ముత్తయ్య మరియు కార్యకర్తలు హాజరు కావడం జరిగినది





# కనుల పండుగలా... రాములోరి కల్యాణం

రామనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

అశ్వారావుపేట, ఏప్రిల్ 06, ప్రజాజ్యోతి: నియోజకవర్గ వ్యాప్తంగా శ్రీరామనవమి సందర్భంగా రామాలయాలతో పాటు గ్రామ,గ్రామనా వాడవాడలా శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం ఆద్యంతం కన్నులపండువగా జరిగింది.అశ్వారావుపేటలో శ్రీ కోదండ రామాలయం, కన్యకపరమేశ్వరి ఆలయం, అటెండర్స్ కాలనీలోనే శ్రీ వినాయకుని ఆలయం, జంగారెడ్డిగూడెం రోడ్ లోని శ్రీ జ్ఞానసాయిబాబా మందిరంలో, అత్యంత భక్తిశ్రద్ధలతో కనుల పండుగల నిర్వహించారు. జ్ఞానసాయిబాబా మందిరం వద్ద జరిగిన నవమి వేడుకలలో అర్చకులు మాట్లాడుతూ రామాయణాన్ని మన జీవనానికి అలవర్చుకుంటే ఆద్యంతం జీవనం సుఖమయం అవుతుందని, సకల గుణాలకు శ్రీరాముడు ఆద్యుడని కొనియాడారు. మానవత్వంలోనే దైవత్వాన్ని చూపిన శ్రీ మహావిష్ణువే శ్రీరాముడన్నారు. ధర్మానికి ప్రతీక రాముడని పృధ్వికి ప్రతీక సీతాదేవి అని వారి కళ్యాణం కమనీయంగా జరుపుకున్న ప్రతి భక్తులకు సకల శుభాలు కలుగుతాయన్నారు. రాములోరి కళ్యాణానికి భక్తులు భారీగా తరలి వచ్చారు అనంతరం శ్రీ షిర్డీసాయి సేవ సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షిర్డీసాయి సేవ సమితి అధ్యక్షులు పంబి హరిబాబు, మంగదొడ్డి మురళీకృష్ణ, ముళ్లపూడి సూరిబాబు, కేతా ధనరాజు, తిరుమలశెట్టి అప్పారావు, ఎస్.సురేంద్ర, పృద్వి, గౌరీ, విమలశ్రీదేవి, రమాదేవి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.







# ఇల్లెందులో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ఇల్లెందు, ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి:



ఇల్లెందు మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాలలో శ్రీరామనవమి సందర్భంగా భక్తులు ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి రాములోరి కళ్యాణాన్ని వైభవోపేతంగా జరిపించారు. పట్టణంలోని ఆమ్ బజార్, 24 ఏరియా, ఇందిరానగర్, స్టేషన్ బస్తి తో పాటు వివిధ ఆలయాలలో సీతారాముల తిరు కళ్యాణ క్రతువును నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. ఆమ్ బజార్లో ఆర్యవైశ్య వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సీతారామ చంద్ర స్వాముల శోభాయాత్రను మేళ తాళాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ పట్టణ మండల అధ్యక్షులు అర్వపల్లి రాధాకృష్ణ, ప్రొద్దుటూరు నాగేశ్వరరావు, రవి కిరణ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.